బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 15 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4

## హైదరాబాద్‌లో రూ.కోటి విలువైన డ్రగ్స్ పట్టివేత

- నైజీరియన్ సహా ముగ్గురి అరెస్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లో ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.1.10 కోట్ల విలువైన 256 గ్రాముల డ్రగ్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో నైజీరియన్, డ్రగ్ డెలివరీ బాయ్, మరో నిందితుడు ఉన్నారు. ఈ డ్రగ్స్ ముఠాను బంజారాహిల్స్ పోలీసులు, హెచ్ న్యూ పోలీసుల సంయుక్త కార్యాచరణతో పట్టుకున్నారు.



# ప్రపంచంతోనే పోటీ పడతాం..

## పక్క రాష్ట్రాలతో కాదు..



- ఒప్పందాల పర్యవేక్షణకు ఇన్వెస్టర్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- పదేండ్లలో 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్**

అంతర్జాతీయ, జాతీయ స్థాయి కంపెనీలతో చేసుకునే ఒప్పందాలు ఎప్పటికప్పుడే కార్యరూపందాల్చేలా కొత్తగా తెలంగాణ ఇన్వెస్టర్స్ టాస్క్ ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటిం చారు. టెక్నాలజీ, స్కిల్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో అపారమైన అవకాశాలున్న తెలంగాణలో పెట్టుబడుల భద్రతకు ప్రభుత్వమే భరోసా ఇస్తుందని చెప్పారు. రాబోయే పదేండ్లలో తెలంగాణను 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం 'తెలంగాణ ది ఫ్యూచర్ స్టేట్ ' నినాదంతో ప్రజాప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలను అమలుచేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ ప్రపంచంతోనే పోటీపడుతుంది కానీ పక్క రాష్ట్రాలతో కాదని సీఎం అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత నాలుగో నగరమైన ఫ్యూచర్ సిటీని ప్రపంచ అవసరాలు తీర్చగలిగేలా 'చైనా ప్లస్ వన్ కంట్రీ' స్థాయిలో ఉంటుందని చెప్పారు. దిగ్గజ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కోకాపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యాంపస్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ , ఉన్నతాధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కాగ్నిజెంట్ సంస్థకు దేశంలోనే హైదరాబాద్ అతిపెద్ద కేంద్రంగా మారిందని, ప్రస్తుతం సుమారు 65వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారని, తద్వారా తెలంగాణలో ఉద్యోగాలు కల్పించే రెండో అతిపెద్ద సంస్థగా కాగ్నిజెంట్ ఎదగడం గొప్ప విషయమని ముఖ్యమంత్రి అభినందించారు. దావోస్ పర్యటనలో అంగీకారం

మిగితా 2వ పేజీలో



## హైదరాబాద్ చేరుకున్న సీఎం

**బలగం టీవీ, హైదరాబాద్**

అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటనను విజయవంతంగా ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. పది రోజుల పాటు సాగిన పర్యటన పూర్తి చేసుకుని హైదరాబాద్ చేరుకున్న సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఉన్నతస్థాయి అధికారుల బృందంతో సాగిన ఈ పర్యటన తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ప్రత్యక్షంగా, పరోక్షంగా యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు దోహదపడే పెట్టుబడులే లక్ష్యంగా సాగింది. 50 కిపైగా రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, ముఖాముఖి సమావేశాల్లో పాల్గొని TelanganaTheFutureState పై ప్రణాళికలను సమగ్రంగా వివరించారు.

ముఖ్యంగా నెట్ జీరో సిటీ, AICity, #SkillUniversity, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఆర్టిఫీ షియల్ ఇంటలిజెన్స్, డేటా సెంటర్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలకు చెందిన కంపెనీలతో పాటు ఫార్మా, లైఫ్ సైన్సెస్, కాస్మటిక్స్, టెక్స్‌టైల్, ఎలక్ట్రిక్ వాహన రంగాలకు చెందిన అనేక కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. పెట్టుబడులకు తెలంగాణలో ఉన్న సానుకూలతలను వివరించారు. తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రణాళికలను సోదాహరణగా సదస్సుల్లో వివరించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలపాలన్న లక్ష్యాలను తెలిపారు. ఈ పర్యటనలో పలు సంస్థలతో ఒప్పందాలు కుదరగా మరికొన్ని సంస్థలు పెట్టుబడులకు ఆసక్తిని వ్యక్తీకరించాయి.

## సుంకిశాల ఘటన.. ప్రాజెక్టు డైరెక్టర్ పై బదిలీ వేటు

## సర్కిల్-3 అధికారులపై సస్పెన్షన్



**బలగం టీవీ, హైదరాబాద్**

సుంకిశాల ఘటనపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంబధిత అధికారులపై చర్యలు తీసుకుంది. జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు వేసింది. ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్ – 3 (సుంకిశాల)లో పని చేస్తున్న సీజీఎం కిరణ్ కుమార్, జీఎం మరియ రాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీష్‌లను సస్పెండ్ చేసింది. టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్‌కు ప్రాజెక్టు డైరెక్టర్ ఇన్ ఛార్జి బాధ్యతలు అప్పగించారు. నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతోపాటు ఉన్నత స్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. సీజీఎం కిరణ్ కుమార్, జీఎం మరియా రాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌లను సస్పెండ్ చేస్తూ పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్ ఆదేశాలు జారీ చేశారు.

సుంకిశాల ప్రాజెక్టులో సైడ్ వాల్ కూలిన ఘటనపై జలమండలి ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంది. ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్ 3లో పనిచేస్తున్న సీజీఎం కిరణ్ కుమార్, జీఎం మరియా రాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌లను సస్పెండ్ చేసింది. అలాగే నిర్మాణ సంస్థకు షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హైదరాబాద్‌కు తాగునీరు అందించే సుంకిశాల ప్రాజెక్టు వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ నీట మునిగింది. నాగార్జునసాగర్‌కు భారీగా వరద నీరు పోటెత్తడం, ఒక్కసారిగా పంప్‌హౌస్ రెండో సొరంగ మార్గం నుంచి ప్రవాహం ఉద్ధృతంగా రావడంతో టన్నెల్ ముందు భాగంలో నిర్మాణంలో ఉన్న గేటుతోపాటు రక్షణ గోడలోని ఒక ప్యానెల్ కొట్టుకుపోయాయి. దీంతో 83 మీటర్ల లోతులో ఉన్న పంప్‌హౌస్‌లోని సంపు పూర్తిగా నీటితో నిండిపోయింది. ఆ సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 510 అడుగులకన్నా తగ్గితే హైదరాబాద్‌కు నీటి తరలింపు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీరు తరలించేందుకు వీలుగా నల్గొండ జిల్లా పెద్దవూర మండలం పాల్తితండాలో సుంకిశాల గట్టు వద్ద పంప్‌హౌస్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో జలమండలి శ్రీకారం చుట్టింది. 2021 మార్చి 16న ప్రభుత్వం మేఘా సంస్థకు పనులను కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చింది. తొలుత రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో పనులు కేటాయించగా అక్టోబరు 2022లో వ్యయాన్ని రూ.2,214 కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. పనులు 70 శాతం పూర్తయ్యాయి. వివిధ లోతుల్లో నీటిని తీసుకునేందుకు వీలుగా పంప్‌హౌస్ నుంచి మూడు సొరంగాలు(టన్నెళ్లు) నిర్మిస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 455 అడుగుల లోతు నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా మొదటి సొరంగాన్ని, 504 అడుగుల లోతు నుంచి తీసుకునేందుకు రెండోది, 547 అడుగుల లోతు నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా మూడోది నిర్మిస్తున్నారు.

పంప్‌హౌస్, కృష్ణానదికి మధ్య కేవలం 192 మీటర్లు మాత్రమే దూరం ఉంది. వరద వచ్చిన సమయంలో ఆ ఉద్ధృతి తాకిడి పంప్‌హౌస్‌లోకి చేరకుండా రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) నిర్మించారు. వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మధ్య టన్నెల్ పనులు పూర్తిచేసే క్రమంలో సంపువైపు టన్నెల్ ముందు భారీ గేటు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికిగానీ మధ్య టన్నెల్ స్థాయి వరకు వరద రాదని భావించారు. 'దానికి భిన్నంగా దాదాపు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో సాగర్ వద్ద అకస్మాత్తుగా ఒత్తిడి పెరిగి ఈ నెల 2న ఉదయం 7 గంటల సమయంలో టన్నెల్‌లోకి భారీ వరద చేరింది.

## పల్లెల్లో, పట్టణాల్లో పడకేసిన పాలన

- అధ్వాన్నంగా పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ
- ఇందిరమ్మ రాజ్యంలో పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయి
- నిధులు లేక, పెండింగ్ బిల్లులు రాక తీవ్ర సంక్షోభంలో పంచాయితీలు
- ప్రజాపాలనంటే పంచాయతీలకు పైసలివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా?
- కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించారు
- దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలపై ఎందుకింత నిర్లక్ష్యం
- భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓవైపు తెలంగాణ పల్లెల్లో పాలన పడకేసిందని... మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ ను కూడా పట్టించుకోకపోవటంతో పల్లెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారిందన్నారు. కనీసం దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు విజృంభించి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీలకు నిధులు చెల్లించకపోవటంతోనే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీల నిర్వహణ తీవ్ర సంక్షోభంలో పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలకు నిధులివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా మీ ప్రజాపాలన అని ప్రశ్నించారు.

సర్పంచ్ లకు పాత పనులకు సంబంధించి ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించటం లేదన్నారు. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్ ల పరిస్థితి కూడా అగమ్యగోచరంగా మారిందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్ గా రూ.275 కోట్లు విడుదల చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1800 మంది మాజీ సర్పంచ్ లపై నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేస్తూ వారిని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామపంచాయతీలకు ఎప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ. 2100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించాలో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మొత్తం 12,769 పంచాయితీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4305 కోట్లుగా ఉందని...వాటి పరిస్థితి ఏంటనీ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు.

దేశానికే పట్టుగొమ్మలుగా భావించే పల్లెలపై కాంగ్రెస్ పాలకులు ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పల్లెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నాయన్నారు. "ప్రజాపాలనలో.. పల్లె ప్రగతికి పాతరేసి.. పట్టణ ప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా ? మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదు.. కొత్త పనులకు ప్రణాళిక లేదు. నిధులు లేక పూర్తిగా నీరసించిన మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మత్తులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా ?" అని కేటీఆర్ అన్నారు. వర్షాకాలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రతినిత్యం అవస్థలు పడుతున్న ప్రజలకు ఏం సమాధానం చెబుతారు ? మున్సిపాలిటీల్లో రూ.1200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే...ఇక ఇతర శాఖల పరిస్థితి ఏమిటన్నారు.

గ్రేటర్ తోపాటు.. రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో జీహెచ్ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో.. మహానగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ఆగష్టు 15 లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ఈ ప్రభుత్వానికి ఉందా ? కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను ఇప్పటికైనా గట్టెక్కించే ధైర్యం ఉందా ? మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన చేపట్టే ఆలోచన ఉందా ? " అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు పచ్చగా కళకళలాడిన పల్లెలు, ప్రగతిపథంలో దూసుకుపోయిన పట్టణాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎందుకు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయనో చెప్పాలన్నారు. ఇది కాంగ్రెస్ అసమర్థతకు, పాలనా వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. మీ చేతకానితనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందన్న విషయాన్ని మరిచిపోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తెలంగాణలో ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో రాజ్యసభ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. బిఆర్ఎస్ పార్టీతో పాటు రాజ్యసభ సభ్యత్వానికి కె. కేశవరావు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఇవాళ్టి నుంచి ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. ఆగస్టు 27న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. ఒకవేళ ఎన్నిక అవసరమైతే సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎన్నికల సంఘం వివరించింది. కె కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.

## ఎమ్మెల్సీల నియామకంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు




**బలగం టీవీ, న్యూఢిల్లీ**

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎమ్మెల్సీల నియామకం కేసులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై 'స్టే' విధించింది సుప్రీంకోర్టు.. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా కూడా స్టే విధించాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్. గవర్నర్ నామినేట్ చేయడాన్ని తాము అడ్డుకోలేమన్న ధర్మాసనం కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే, గవర్నర్, ప్రభుత్వ హక్కులు హరించినట్లు అవుతుందని తెలిపింది. ఎప్పటికప్పుడు నియామకాల చేపట్టడం ప్రభుత్వ విధి అని పేర్కొంది ధర్మాసనం. వాస్తవానికి తమ నియామకాన్ని పక్కన పెట్టి, కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేశారు బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ. విచారణను నాలుగు వారాలు వాయిదా వేసింది ధర్మాసనం. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం. ప్రభుత్వం, గవర్నర్ ఎలాంటి చర్యలు తీసుకున్నా, సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది ధర్మాసనం.

## రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

- మాజీ సీఎం కేసీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల పోరాటాలు, మరెందరో బలిదానాల ఫలితంగా సాధించుకున్న దేశ స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకూ చేరిన నాడే సంపూర్ణ సార్థకత చేకూరుతుందని అన్నారు. మహాత్మా గాంధీ నడిపించిన భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో శాంతియుత మార్గంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం, ప్రజల సహకారంతో పదేండ్ల అనతికాలంలోనే దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అన్నిరంగాల్లో సబ్బండ వర్గాల అభ్యున్నతి దిశగా దేశ పాలకుల కార్యాచరణ మరింత చిత్తశుద్ధితో అమలుచేసి ఫలితాలు సాధించడం ద్వారా మాత్రమే స్వాతంత్ర్య పోరాట త్యాగధనులకు మనం అర్పించే ఘన నివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

# రూ. 36 వేల కోట్ల పెట్టుబడుల రికార్డు

## అమెరికాలో రూ.31502 కోట్లు.. దక్షిణ కొరియాలో రూ.4500 కోట్లు

- తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ
- 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు
- విజయవంతమైన సీఎం విదేశీ పర్యటన
- ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా ప్రణాళికలు





**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బృందం విదేశీ పర్యటన విజయవంతమైంది. పెట్టుబడుల లక్ష్య సాధనలో సరికొత్త రికార్డు నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణకు భారీగా పెట్టుబడులు వెల్లువెత్తాయి. అమెరికా పర్యటనలో రూ.31502 కోట్ల పెట్టుబడులు రాగా.. చివరి రెండు రోజుల దక్షిణ కొరియా పర్యటనలోనూ అదే స్పందన వెల్లువెత్తింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచస్థాయి కంపెనీలు ముందుకు వచ్చాయి. రూ.4500 కోట్ల పెట్టుబడులకు అక్కడి కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. దీంతో అమెరికా, దక్షిణ కొరియా పర్యటనతో మొత్తం రూ.36 వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ సాధించింది. మొత్తం 25 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఆయా రంగాల్లో కొత్త సంస్థలు, కొత్త పరిశ్రమలతో వేలాది కొత్త ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి జనవరిలో దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొన్నారు. ఆ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులకు లైన్? కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. తాజాగా అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో మరో రూ.36 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. దీంతో ఎనిమిది నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం రూ.76,232 కోట్ల మేర పెట్టుబడుల లక్ష్యాన్ని చేరుకోవటం సరికొత్త రికార్డు నమోదు చేసింది. దేశంలోనే పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బృందం ప్రధానంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్ టైల్ రంగాలపై దృష్టి సారించింది. వీటిలో ప్రపంచంలో దక్షిణ కొరియాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా పలు కంపెనీలతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో పాటు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్?బాబు చర్చలు, సంప్రదింపులు జరిపారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించి, రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకోచ్చే కంపెనీలకు ప్రభుత్వం తగినంత సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి భారీ స్పందన లభించింది.

హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. తమ కంపెనీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ను హైదరాబాద్లో ఏర్పాటు చేసి గ్లోబల్ హబ్గా ఎంచుకుంటామని ప్రకటించింది. కంపెనీ కొత్త టెస్టింగ్ వాహనాలను తయారు చేసే సదుపాయం తెలంగాణలో అందుబాటులో ఉంటుందని అన్నారు.

వరంగల్ మెగా టెక్స్టైల్ పార్క్లో వస్త్ర తయారీ పరిశ్రమలు నెలకొల్పుతున్న యంగ్వన్ కంపెనీ హైదరాబాద్లో ఫ్యాషన్ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. అందుకు అవసరమయ్యే 10 ఎకరాల స్థలాన్ని ఎయిర్పోర్ట్ కు సమీపంలో కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున సమ్మతించే లేఖను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి యంగ్వన్? ఛైర్మన్కు అందించారు..

కాస్మెటిక్ ఇండస్ట్రీలో దక్షిణ కొరియా ప్రత్యేక స్థానముంది. ఆ రంగంలో పేరొందిన కంపెనీల పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాస్మెటిక్స్ తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు పరస్పర సహకారం కోరారు. తెలంగాణలో వీటి తయారీకి ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలు అన్వేషించాలని కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్ (%ఖఉదీక్ష్మీూూ%)తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది.

ఇదే సందర్భంగా మరో మూడు కొరియన్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ప్రణాళికలను ప్రకటించాయి. డాంగ్బాంగ్ (%ణశీఅస్త్రఋఅస్త్ర%) ఫార్మా కంపెనీ రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏపీఐ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. జేఐ టెక్ (%జీక్ష్మీ ూవఎష్ట్ర%) కంపెనీ ఎల్ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్ తో పాటు రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. రూ. 100 కోట్ల పెట్టుబడులకు సిద్ధపడింది. చావి(%జష్టువజఱ%) కంపెనీ హైదరాబాద్లో ఈవీ ఛార్జింగ్ ఇన్ఫ్రాని తయారు చేయనున్నట్లు ప్రకటించింది.

ఎల్ ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, శామ్సంగ్ సీ అండ్ టీ, శామ్సంగ్ హెల్త్ కేర్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. భవిష్యత్తు విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణలో తమ పెట్టుబడులకు అనువైన గమ్య స్థానంగా ఎంచుకోవాలని ఆహ్వానించారు.

పర్యటనలో భాగంగా కొరియాలోని చెంగియాచియోన్ స్ట్రీమ్ రీడెవలప్మెంట్, హాన్ రివర్ఫ్రంట్ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ అనుసరించిన కొన్ని అద్భుతమైన నమూనాలను ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టుకు వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆ ప్రాజెక్టుల అభివృద్ధికి అనుసరించిన విధానాలు, వాటిని నిర్వహిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్శిటీని ముఖ్యమంత్రి సందర్శించారు. ఇటీవలి ఒలింపిక్స్? విజేతలెందరినో ఈ యూనివర్సిటీ తీర్చిదిద్దింది. మన రాష్ట్రంలోనూ అదే తరహాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు.




## రాష్ట్రంలో కొత్త పంచాయతీలు

- కొత్తగా 223 పంచాయతీల ఏర్పాటు
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- 12,991కి చేరిన మొత్తం పంచాయతీల సంఖ్య
- మున్సిపాల్టీగా ములుగు
- గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. కొత్త పంచాయతీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లాల అధికారులకు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు కొత్త పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కొత్త పంచాయతీల ఏర్పాటుతో తెలంగాణలో పంచాయతీల సంఖ్య 12,991కు చేరింది. ఇప్పటి వరకు 12,769 గ్రామ పంచాయతీలు ఉండేవి. కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. అలాగే ఒక పంచాయతీని మున్సిపాల్టీగా ఏర్పాటు చేశారు. దీంతో పంచాయతీల సంఖ్య 12,991కు చేరింది.

ములుగు మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాల్టీగా అప్గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పంచాయతీల ఏర్పాటుతోపాటు జిల్లా కేంద్రమైన ములుగును కూడా మున్సిపాల్టీగా ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల్లో వివరాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను చేయాలని ప్రతిపాదిస్తూ అసెంబ్లీ, మండలి బిల్లును ఆమోదించాయి. ఆ బిల్లును అప్పటి గవర్నర్ తమిళిసై పెండింగ్లో పెట్టారు. ఆ తర్వాత వచ్చిన గవర్నర్ ఈ బిల్లుకు ఆమోదం తెలపడంతో కొత్త పంచాయతీలపై రేవంత్ సర్కారు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# ప్రపంచంతోనే పోటీ పడతాం..




(మొదటి పేజీ తరువాయి)

కుదిరితే, కేవలం ఆరు నెలల వ్యవధిలోనే కాగ్నిజెంట్ వారు హైదరాబాద్ లో నూతన క్యాంపస్ ఏర్పాటు చేయడం రికార్డు అని సీఎం అభినందించారు.

శతాబ్దాల మనగడలో హైదరాబాద్ నేడు విశ్వనగరంగా ఎదిగిందని, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ గారి మద్దతుతో ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం నేదురుమల్లి గారు ఐటీ పార్కుకు శంకుస్థాపన చేసిన నేపథ్యమే హైదరాబాద్ ను ఐటీలో మేటిగా నిలబెట్టిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోగానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాతగానీ పాలకులు హైదరాబాద్ విషయంలో రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనపెట్టారని , ప్రస్తుత ప్రపంచ అవసరాల దృష్ట్యా తాము నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళుతుందని సీఎం తెలిపారు.

పెట్టుబడుల సాధన కోసం ఇటీవల చేపట్టిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలు విజయవంతం అయ్యాయని, ఒక్క అమెరికాలోనే సుమారు 31వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాబట్టగలిగామని, తద్వారా దాదాపు 30వేల ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా పెట్టుబడులు, ఒప్పందాల ప్రక్రియ కొనసాగుతుందని సీఎం అన్నారు. తెలంగాణకు మొత్తం మూడు వలయాలు ఉంటాయని, కోర్ అర్బన్ హైదరాబాద్ మొదటి వలయమైతే, రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉండే రెండోదైన సెమీ అర్బన్ వలయంలో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్, ఫ్యూచర్ సిటీ ఉంటాయని, ఇక మూడో వలయమైన రూరల్ తెలంగాణలోని గ్రామాలను ఆసియాలోనే ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఐటీ రంగాన్ని కొత్తపుంతలు తొక్కిస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని అన్నింటితో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి గారు భావిస్తున్నారని ఐటీ మంత్రి తెలిపారు.

తెలంగాణ యువతలో నైపుణ్యాలు పెంచి గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ప్రజాప్రభుత్వం సరికొత్తగా ఏఐ సిటీని నిర్మిస్తోందని, సెప్టెంబర్ లో ప్రతిష్టాత్మక ఏఐ గ్లోబల్ సదస్సును కూడా నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు గారు వెల్లడించారు.




## వినేశ్ ఫోగట్ అప్పీల్ను తిరస్కరించిన స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్

**బలగం టీవి, హైదరాబాద్**

భారత మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగాట్కు నిరాశ తప్పలేదు. తనకు సిల్వర్ మెడల్ ఇవ్వాలంటూ చేసిన అప్పీల్ను స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ తిరస్కరించింది. ప్యారిస్ ఒలింపిక్స్లో మహిళల 50 కిలోల విభాగంలో వినేశ్ ఫైనల్కు చేరింది. అయితే, ఫైనల్కు ముందు నిర్ణీత పరిమితి కంటే వంద గ్రాములు అధికంగా బరువు ఉన్నట్లు తేలడంతో అనర్హురాలిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, తనకు సిల్వర్ మెడల్ ఇవ్వాలంటూ స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్కు అప్పీల్ చేసింది. ఈ అంశంపై విచారణ జరిపిన కాస్.. నిర్ణయాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. అయితే, ఈ నెల 16 నిర్ణయం ప్రకటిస్తామన్న కాస్.. అనూహ్యంగా బుధవారమే నిర్ణయాన్ని వెలువరించింది. కాస్ నిర్ణయంతో ఒలింపిక్లో పతకం సాధించాలన్న వినేశ్ కల చెదిరిపోయినట్లయ్యింది. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీకి వ్యతిరేకంగా వినేశ్ ఫోగట్ చేసిన అప్పీల్ను ట్రిబ్యునల్ ఫర్ స్పోర్ట్స్ తిరస్కరించడంపై భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష నిరాశ వ్యక్తం చేశారు.

మహిళల 50 కేజీల ఫ్రీ స్టయిల్ ఈ వెంట్లో గత మంగళవారం జపాన్కు చెందిన యుయి సుసాకిపై విజయంతో సహా మూడు విజయాలతో వినేశ్ ఫైనల్కు చేంది. ఫైనల్కు ముందు వంద గ్రాముల అధిక బరువు కారణంగా అమెరికాకు చెందిన సారా హిల్డెబ్రాండ్తో పోటీ పడాల్సి ఉండగా.. అనూహ్యంగా అనర్హత వేటు వేపడింది. స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ కోర్టుకు పెట్టుకున్న అప్పీల్లో క్యూబా రెజ్లర్ యుస్నెలిస్ గుజ్మాన్ లోపెజ్తో కలిసి తనకు జాయింట్ సిల్వర్ మెడల్ ఇవ్వాలని వినేశ్ విజ్ఞప్తి చేసింది. గుజ్మాన్ లోపెజ్ సెమీ ఫైనల్స్లో వినేష్ చేతిలో ఓటమిపాలైంది. వినేశ్పై అనర్హతతో గుజ్మాన్ ఫైనల్కు వెళ్లింది. అనర్హత వేటు పడిన తర్వాత రెజ్లింగ్కు వినేశ్ రిటైర్మెంట్ ప్రకటించింది. ఆటను కొనసాగించే శక్తి తనకు లేదని పేర్కొంది. ఆ తర్వాత వినేశ్ యావత్ దేశం మద్దతుగా నిలిచింది.

## 'డిపోలు ప్రైవేట్పరం' ప్రచారంలో నిజం లేదు




- టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సుల ఆపరేషన్స్
- డిపోల ప్రైవేట్పర దుష్ప్రచారాన్ని ఖండించిన టీజీఎస్ఆర్టీసీ

**బలగం టీవి, హైదరాబాద్**

తమ డిపోలను ప్రైవేట్పరం చేస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) యాజమాన్యం స్పష్టం చేసింది. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా కొందరు చేస్తోన్న ఈ దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ ప్రకారమే పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి సంస్థ తీసుకువస్తోందని పేర్కొంది. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో సహా అన్ని బస్సుల ఆపరేషన్స్ నిర్వహణ పూర్తిగా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుందని, అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని వెల్లడించింది.


కేంద్రప్రభుత్వ ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఫేమ్)-1 స్కీమ్లో భాగంగా 2019 మార్చిలో 40 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను ఇదే విధానంలో ప్రవేశపెట్టడం జరిగింది. ఒలెక్ట్రా కంపెనీతో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) పద్ధతిన ఒప్పందం చేసుకుని పుష్పక్ పేరుతో హైదరాబాద్ ఎయిర్పోర్ట్ మార్గంలో ఈ బస్సులను సంస్థ నడుపుతోంది. హైదరాబాద్లోని కంటోన్మెంట్, మియాపూర్-2 డిపోల నుంచి వాటిని తిప్పుతోంది. బస్సుల మెయిన్టనెన్స్, చార్జింగ్ మినహా ఆపరేషన్స్ అంతా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతోంది. 2023 మార్చిలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాం(ఎన్ఈబీపీ) కింద 500 ఇంటర్ సిటీ బస్సులను టెండర్ ద్వారా జేబీఎం కంపెనీకి ఆర్డర్ ఇవ్వడం జరిగింది. అందులో 48 ఈ-సూపర్ లగ్జరీ బస్సులు ప్రస్తుతం రాగా.. వాటిలో 35 కరీంనగర్-2 డిపోకు, 13 నిజామాబాద్-2 డిపోనకు సంస్థ కేటాయించింది. ఈ ఎలక్ట్రిక్ బస్సుల కోసం అవసరమైన చార్జింగ్ స్టేషన్ల నిర్మాణం డిపోల్లో పూర్తి కావస్తుండటంతో.. వాటిని త్వరలోనే ప్రారంభించేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. అలాగే, ప్రజల రవాణా అవసరాలు, కాలుష్య నివారణను దృష్టిలో పెట్టుకుని 2023లో 550 ఎలక్ట్రిక్ బస్సులకు టెండర్లను సంస్థ పిలిచింది. అందులో 500 సిటీ బస్సులు, హైదరాబాద్-విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులున్నాయి. అందులో ప్రస్తుతం సిటీలో 74 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. విజయవాడ మార్గంలో ఈ-గరుడ పేరుతో 10 బస్సులు తిరుగుతున్నాయి. దశలవారీగా ఈ ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ అందుబాటులోకి తెస్తోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వినియోగంలో దేశవ్యాప్తంగా అవలంభిస్తోన్న ఈవీ పాలసీనే 2019 నుంచి టీజీఎస్ఆర్టీసీ అమలు చేస్తోంది. ఎలక్ట్రిక్ బస్సులను నేరుగా కొనాలంటే వ్యయంతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ మేరకు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) పద్ధతిన అంటే బస్సు తిరిగే కిలోమీటర్ల ప్రకారం కంపెనీలకు చెల్లింపులు చేయడం జరుగుతుంది.

ప్రతి డిపో పరిధిలో రూరల్, అర్బన్, తదితర భిన్నమైన రూట్లు ఉంటాయి. ఎలక్ట్రిక్ బస్సులను అన్ని రూట్లలో తిప్పడం సాధ్యపడదు. ఎలక్ట్రిక్ బస్సులు తిరిగే కిలోమీటర్ల సామర్థ్యాన్ని బట్టి రూట్లను సంస్థ గుర్తిస్తుంది. ప్రతి డిపోలోనూ ఎలక్ట్రిక్, డీజిల్ మిశ్రమం ఉంటుంది. ప్రైవేట్ అద్దె బస్సుల మాదిరిగానే ఎలక్ట్రిక్ బస్సులన్నీ టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడుస్తాయి. ఆ బస్సుల ద్వారా వచ్చే టికెట్ ఆదాయం నేరుగా సంస్థకే వస్తోంది. ఒప్పందం ప్రకారం తిరిగిన కిలోమీటర్ల లెక్కన కంపెనీలకు నగదును చెల్లిస్తుంది. డిపోలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తాయనడంలో నిజం లేదు. కొందరు ఉద్దేశపూర్వకంగా చేస్తోన్న ఈ ప్రచారాన్ని నమ్మొద్దని సిబ్బందికి, ప్రజలకు సంస్థ విజ్ఞప్తి చేస్తోంది.

# రేవంత్ భాష మాట్లాడితే సీఎం కాలేరు భట్టి విక్రమార్క..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి




**బలగం టీవి, హైదరాబాద్**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞత కోల్పోయి మాట్లాడుతున్నారని.. రేవంత్ రెడ్డి భాష మాట్లాడితే ముఖ్యమంత్రి కాలేరు.. ఉన్న గౌరవం పోతదని భట్టికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు.తెలంగాణ భవన్లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రంలోని గురుకుల హాస్టళ్లలో విషాహారం తిని పిల్లలు చనిపోతుంటే, వందలాది మంది ఆస్పత్రి పాలవుతుంటే ప్రభుత్వంలో చలనం లేదు. దీనికి కూడా కూడా కేసీఆర్, కేటీఆర్ కారణం అని భట్టి విక్రమార్క మాట్లాడుతున్నారు. 9 నెలల కింద వండిన భోజనాన్ని మీరు ఇప్పుడు పెడుతున్నారా..? అని భట్టిని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క కూడా విజ్ఞతను కోల్పోయి మాట్లాడుతున్నారు. రేవంత్ భాష మాట్లాడితే, ఆయన లాగా అబద్దాలు మాట్లాడతేనే సీఎం అవుతానని భట్టి విక్రమార్క అనుకుంటన్నారేమో..? పాపం సీఎం కాలేరు.. కానీ ఉన్న గౌరవం పోతది. హాస్టల్స్లో పరిశుభ్రతకు బీఆర్ఎస్ కారణమని మాట్లాడుతున్నారు. నువ్వు ముఖం కడుక్కోకుండా మీరు కారణమని మాట్లాడడం సరికాదని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

సీతారామ ప్రాజెక్టుపై మంత్రులు మట్లాడేవన్నీ అబద్దాలేనని మాజీ మంత్రి జగదీశ్రెడ్డి అన్నారు. హరీశ్ రావు చెప్పిన మాటలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన జగదీశ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఓ మంత్రి కంటతడి పెట్టడం ఆశ్చర్యం కలిగించిందన్న మాజీ మంత్రి కష్టం కేసీఆర్దైతే బటన్ నొక్కేది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీతారామ ప్రాజెక్టుపై కనీసం ఒక ఉత్తరమైనా రాశారా? అని ప్రశ్నించారు.

కిరణ్ కుమార్ రెడ్డిదే బలహీనమైన ప్రభుత్వం అనుకుంటే అంతకన్నా బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని జగదీశ్ రెడ్డి అన్నారు. వీధుల్లో కుక్కలు ప్రజలను కరుస్తుంటే కనకపు సింహాసనం మీద కూర్చున్న శునకాలు ప్రతిపక్షాలను కరుస్తున్నాయని వ్యాఖ్యానించారు. సీతారామ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్ రావు ఉన్న మాట అంటే మంత్రులకు ఉలుకు ఎందుకని ప్రశ్నించిన ఆయన ఓ మంత్రి కంటతడి పెట్టడం ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు.

కేసీఆర్ హయాంలో సీతారామ ప్రాజెక్టు పనులు దాదాపుగా పూర్తిచేసారని కనీసం బటన్ నొక్కేటపుడైనా కేసీఆర్ కష్టం గురించి చెప్పాలని మంత్రులను కోరారు. మంత్రి ఉత్తమ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని కనీసం అధికారులతో ఆయన మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టుపై కేసీఆర్ ప్రభుత్వం 2018 నుంచి 2022 దాకా వరుసగా కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపితే అనుమతులు వచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీతారామ ప్రాజెక్టుపై కనీసం ఒక ఉత్తరమైనా రాశారా అని ప్రశ్నించారు.

కృష్ణా బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింత తప్పటడుగు వేసి బీఆర్ఎస్ ఒత్తిడితో వెనక్కి తగ్గారని కాంగ్రెస్ హయాంలోలాగా కేసీఆర్ ప్రభుత్వంలో ఏ ప్రాజెక్టు అంచనాలు పది, పదిహేను రెట్లు పెంచలేదని పేర్కొన్నారు. కమీషన్లు ఇవ్వడం, తీసుకోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటన్న మాజీ మంత్రి కాలువలు తవ్వకముందే మొబిలైజేషన్ అడ్వాన్సులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ నేతలు ఇంకా చంద్రబాబు, వైఎస్ భజన చేస్తున్నారని వాళ్లిద్దరూ తెలంగాణలో ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. వైఎస్ హయాంలో ఆంధ్రా, రాయలసీమ ప్రాజెక్టులు పూర్తయి తెలంగాణ ప్రాజెక్టులు పెండింగ్?లో పడ్డాయని అన్నారు. వైఎస్ రాయలసీమకు 350 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేశారని తెలంగాణకు ఏం చేశారని అడిగారు. వైఎస్, చంద్రబాబు హయాంలో తెలంగాణలో మూడున్నర క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న చెరువు అయినా కట్టారా అని ప్రశ్నించిన జగదీష్ రెడ్డి ఎవరి హయాంలో తెలంగాణ ప్రాజెక్టులు పూరయ్యాయో ఉత్తమ్, భట్టి చర్చకు వస్తారా అని సవాల్ చేశారు.

ఎస్సార్బీసీ పూర్తయినా పూర్తి కాలేదని కాంగ్రెస్ మంత్రులు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. సీతారామ ప్రాజెక్టుపై మంత్రులు మాట్లాడిన ప్రతి వాక్యం అబద్దమే అన్న ఆయన మంత్రులు మాట్లాడిన దానిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని స్పష్టం చేశారు. వడ్లు పండితే ఎక్కడ బోనస్ ఇవ్వాల్సి వస్తుందోనని కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం ఉన్నా సాగునీరు ఇవ్వడం లేదని మాజీమంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ బిడ్డలను స్థానికేతరులను చేసే విధంగా జీఓ 33 తెచ్చారని, ఇంత కన్నా తెలంగాణకు ద్రోహం ఏముంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీఓ 33ను వెంటనే రద్దు చేయాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## నేడు మూడో విడత రుణమాఫీ

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం మూడో విడత రుణమాఫీకి సిద్ధమైంది. ఇప్పటికే తొలి దఫాలో రూ. లక్ష, రెండో దఫాలో రూ. లక్షన్నర వరకు ఉన్న రుణాలను మాఫీ చేసిన ప్రభుత్వం రేపు (15న) రూ. 2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయబోతోంది. ఖమ్మం జిల్లా వైరాలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి రుణమాఫీని ప్రారంభిస్తారు. ఆ వెంటనే రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయి.హైదరాబాద్ గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న అనంతరం సీఎం రేవంత్రెడ్డి హెలికాప్టర్లో వైరా చేరుకుంటారు. అక్కడ ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించిన సీతారామ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో రైతు రుణమాఫీని ప్రకటిస్తారు.ఈ విడతలో రూ. 1.5 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తారు. జులై 18న మొదటి విడతలో భాగంగా రూ. లక్ష లోపు ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. అదే నెల 30న లక్షన్నర రూపాయల లోపు రుణాలను మాఫీ చేసింది. ఇలా 12 రోజుల వ్యవధిలోనే మొత్తం 17.55 లక్షల మంది రైతులకు రూ. 12 వేల కోట్లకుపైగా రుణాలు మాఫీ చేయడం తెలంగాణ చరిత్రలోనే ఇది మొదటిసారని ప్రభుత్వం పేర్కొంది. ఇప్పుడు తుది విడతలో 14.45 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం తెలిపింది.


## నేడు సీతారామ ప్రాజెక్టు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్**

సీతారామ ప్రాజెక్ట్ను గురువారం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రారంభోత్సవం చేయనున్నారు. ముల్కలపల్లి మండలం పూసుగూడెం వద్ద పైలాన్ ఆవిష్కరించనున్నారు. పంప్ హౌస్ మోటార్లు స్విచ్ ఆన్ చేసి డెలివరి సిస్టర్న్ వద్ద గోదారమ్మకు సీఎం పూజలు చేయనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్లను ప్రారంభించిన అనంతరం అక్కడే భోజనాలు చేసుకుని వైరాలో జరుగనున్న భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు

# పోలీస్ వర్సెస్ అడ్వకేట్స్..!

- సిరిసిల్ల లో పోలీసుల తీరుపై 14 రోజులుగా న్యాయవాదుల సమ్మె..
- చినికి చినికి గాలివానగా మారి సమ్మెకు దిగిన న్యాయవాధులు
- 14 రోజులుగా వివిధ కేసుల్లో బెయిల్ పిటిషన్లు వేయక..జనాలకు ఇబ్బందులు
- కోర్టు ఉత్వర్వులను అమలుపై పోలీసులపై అడ్వకేట్ల ఆరోపణలు
- చట్ట పరిధిలోనే తాామున్నామని పోలీసుల వాదన
- రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అడ్వకేట్ల వాకా ల్తాలు బంద్ వివిధ కేసుల్లో బెయిల్ పిటిషన్లు లేక జైళ్లలోనే పలువురు
- పోలీసులు, న్యాయవాధుల మధ్య సయోధ్య కుదిర్తే వారే కరువు
- ఇటు పోలీసులపై, అటు అడ్వకేట్లపై వెల్లువెత్తుతున్న విమర్శలు





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా లో పోలీసులకు న్యాయవాదులకు ప్రచ్చన్న యుద్ధం కొనసాగుతున్నది. వివిధ భూసమస్యల్లో అడ్వకేట్లు ఇంజక్షన్ అర్డర్లు తీసుకువచ్చి పోలీసులకు వచ్చిన వాటిని అమలు చేయకుండా పిటిషనర్ల మీదనే కేసులు నమోదు చేస్తున్నరని, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో న్యాయవాదులకు గౌరవం ఇవ్వడం లేదని, ఇప్పటికి ఏడుగురు అడ్వకేట్లపై కేసులు నమోదు చేశారంటూ న్యాయవాదుల సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లిలో ఓ న్యాయవాదికి కాంగ్రెస్ నేతకు భూవివాదం నెలకొని.. ఈ సమస్య కాస్తా పోలీస్ వర్సెస్ అడ్వకేట్స్ గా మారిందని తెలుస్తోంది. న్యాయవాది సురభి సత్యనారయణ రావుకు మద్దతుగా 45 మంది జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ను కలిసేందుకు వెళ్లగా తమను కలవకుండా అవమానించారని పేర్కొంటూ సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అడ్వకేట్లు ఆందోళన ప్రారంభించారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ గత 14 రోజులుగా వేములవాడ, సిరిసిల్ల కోర్టుల్లో అడ్వకేట్లు సమ్మెకు దిగారు. సిరిసిల్ల కోర్టు ముందు రెండు రోజులుగా రీలే నిరహార ధీక్షలు చేస్తున్నారు.

**కోర్టు ధిక్కార కేసులు వేయకుండా.. ప్రత్యేక్ష పోరాటాల పట్ల అడ్వకేట్ల తీరుపై విమర్శలు..**

భూవివాదాల్లో పోయిషన్లకు ఉన్నవాళ్లకే పోలీసులు మద్దతు పలుకుతున్నారని, ఇంజిక్షన్ అర్డర్లు బుట్టదాఖలు చేస్తున్నరంటూ సమ్మెకు దిగడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు కోర్టు ఆదేశాలు అమలు చేయకుంటే.. ఆధారాలతో సహా కోర్టు ముందుంచి.. మళ్లీ చట్టపరంగా పోలీసులపై చర్యలు తీసుకోవచ్చు. కోర్టు ధిక్కారం చట్టం 1971ప్రకారం సదరు పోలీసు అధికారులకు నోటీసులు ఇవ్వోచ్చు.. కోర్టు మందు నిలబెట్టోచ్చు. కానీ ఇలా చేయకుండా చట్టపరంగా కాకుండా.. సాధారణ జనంలాగా వందలాది న్యాయవాదులు తమ ప్రాక్టీస్ బంద్ చేసి సాధారన జనాలకు ఎందుకు ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ జనంలో ఒక చర్చ ప్రారంభమైంది. కేవలం ఒక్క న్యాయవాది భూసమస్యను తీసుకొని న్యాయవాదులు మొత్తం ఒక్కతాటిపైకి వచ్చి సమ్మెకు పోవడం ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు. వివిధ కేసుల్లో జైలు పాలైన వారు ఈ సమ్మెతో బెయిల్ పిటిషన్లు వేసేవారు లేక జైళ్ల లో మగ్గుతున్నారు.

**పోలీసుల తీరుపైనా విమర్శలు..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలువురు ఎస్సై ల తీరు పోలీసు శాఖకు మచ్చ తీసుకువస్తున్నదని విమర్శలు వస్తున్నాయి. వెనుకా ముందు ఆలోచన లేకండా చట్టాలను తమ వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి, భూవివాదాల్లో చట్ట పరిధి దాటి ఒక్క పార్టీకి సపోర్టు చేయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలుస్తోంది. వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో కోనరావుపేట ఎస్సైపై ఇలాంటి ఆరోపణలు అనేకం ఉన్నాయి. ముగ్గురు దళిత జర్నలిస్టులు తనకు వ్యతిరేకంగా వార్తాలు రాస్తున్నరంటూ.. ఎస్సై సివిల్ మ్యాటర్ లో తలదూర్చిన విషయం పత్రికల్లో రాశారని, ఇసుక అక్రమ రవాణ విషయం రాశారని పేర్కొంటూ రాత్రికి రాత్రి ఫిర్యాదు లేకుండానే అరెస్టులు చేసి రెండు సంవత్సరాల కింద రూ.10 వేలు మాముళ్లు తీసుకున్నరంటూ విలేకరులను వారం రోజుల పాటు జైలుకు పంపాడని ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా సిరిసిల్ల న్యాయవాదుల ఆరోపణ ప్రకారం.. భూవివాదాల్లో పలువురు ఎస్సై లు వ్యవహరిస్తున్న తీరు.. అభ్యంతరకంగా ఉందని పేర్కొంటున్నారు. జిల్లాలో ఏడుగురి అడ్వకేట్లపై కేసులు నమోదు చేశారని, భూవివాదాల్లో బాధితుల మీదనే కేసులు నమోదు చేస్తున్నరని, కోర్టు ఉత్వర్వులు కూడా పోలీసులకు లెక్క లేదని సిరిసిల్ల జిల్లా న్యాయవాధుల సంఘాలు పేర్కొంటున్నాయి. పోలీసుల తీరును జిల్లా అధికారి అయిన ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని 45 మంది న్యాయవాదులం వెళితే.. తమకు సమయం ఇవ్వలేదని వాపోయారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలువురు పోలీసు అధికారుల విచ్చలవిడతనంలో పోలీసుశాఖకు చెడ్డపేరు రావడంమే కాకుండా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ.. ప్రజల మన్ననలు పొందుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్ కు కూడా చెడ్డ పేరు వస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఏది ఏమైన పోలీస్ శాఖకు .. న్యాయవాధులకు ఆనారోగ్య వాతవరణం ఎప్పటికి మంచిది కాదని.. చర్చలతో సమస్యను సద్దుమనిగించి.. సమ్మె విరమిస్తే.. సాధారణ జనాలకు, వివిధ కేసుల ఆరోపణల మీద జైళ్లో మగ్గుతున్న వారికి న్యాయం జరిగే అవకాశాలు ఉన్నాయి. పెద్ద మనసుతో న్యాయవాధ సంఘాలు.. సమ్మెలతో ఈ సమస్యను కొనసాగించకుండా చర్చలతో సమ్మె విరమించి తమ న్యాయసేవలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అడ్వకేట్లతో చర్చించడానికి సిద్దంగా ఉన్నాం**

పోలీస్ శాఖ ఎవరికి శత్రువు కాదు. తాము చట్ట పరిధిలోనే పని చేయాలి. పని చేస్తాం. భూ వివాదాల్లో పోలీస్ శాఖ తలదూర్చదు. కొన్ని గైడ్ లెన్స్‌ను పాటిస్తాం. నా కార్యాలయానికి న్యాయవాదులు వచ్చిన రోజు నేను విడియో కాల్ లో ఉన్నాను. కాస్త ఆలస్యం జరిగి ఉండొచ్చు. కానీ అప్పటికి వారు వెళ్లిపోయారు. వారు ఎందుకు సమ్మె చేస్తున్నారో కూడా మాకు పూర్తి స్థాయిలో సమాచారం లేదు. కానీ పోలీస్‌శాఖ న్యాయవాదులకు సహకరిస్తుంది. శాంతిభద్రతల పరిరక్షణలో అడ్వకేట్ల సహకారం కూడా మాకు అవసరం. మా ఎస్సై లు ఏమైనా తప్పిదాలు చేస్తే విచారణ జరుపుతాం. న్యాయవాదులు నా ఆఫీస్‌కు ఎప్పుడైనా రావచ్చు. చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. నేను అడ్వకేట్లను ఎప్పుడు గౌరవిస్తాను. అగస్టు 15 జెండా వందనం తర్వాత.. న్యాయవాదులు నా కార్యాయాలని రావచ్చు.. ఆహ్వానిస్తున్నాను. కలిసి మాట్లాడి.. సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాను. చట్ట ప్రకారం ఏమైన కేసులు నమోదు చేశారంటే పూర్తి స్థాయిలో విచారణ చేయించి క్లోజ్ చేయిస్తాం. పోలీసుశాఖ ఎప్పుడు ప్రజల కోసమే పని చేస్తుంది. ప్రజా రక్షణ తమ ధ్యేయం. సిరిసిల్ల జిల్లా న్యాయవాధులను సాదరంగా తమ కార్యాలయానికి ఆహ్వానిస్తాం

**– ఎస్పీ అఖిల్ మహాజన్. రాజన్న సిరిసిల్ల**

## హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

- మరొకరికి ఏడేండ్ల జైలు శిక్ష...
- ఎస్పీ అఖిల్ మహాజన్ ,



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు , 5000 రూపాయల జరిమాన, మరొకరికి 07 సంవత్సరాల జైలు శిక్ష,3000/- రూపాయల జరిమాన విధిస్తూ సిరిసిల్ల డిస్టిక్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్. ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన బారాజు మల్లారెడ్డి , నరసింహా రెడ్డి , ఎమిరెడ్డి రాంరెడ్డి , కనక రెడ్డి ,లచ్చి రెడ్డి లకు చాలా కాలం గా భూమి తగాదాలు ఉన్నాయి. 2015-05-25 రోజున ఏమిరెడ్డి రాంరెడ్డి, అతని కుమారులు కనక రెడ్డీ , లచ్చిరెడ్డి లు వారి పొలం లో పనులు చేస్తుండగా, భారాజు మల్లారెడ్డి,వారి తండ్రి నరసింహారెడ్డి ఇద్దరు అక్కడికి వచ్చి, ఎడ్ల కచరం కొయ్యాలతో ఎమిరెడ్డి రాంరెడ్డి , కనకారెడ్డి , లచ్చిరెడ్డీ లపై దాడి చేశారని తెలిపారు. దాడిలో రాంరెడ్డి స్పృహ కోల్పోగా, కనకారెడ్డి , లచ్చిరెడ్డీ లకు గాయాలు కాగా వెంటనే వారిని స్థానికులు కరీంనగర్ అపోలో రిచ్ హాస్పిటల్‌యఅ తరలించి,చికిత్స చేయించారు.రాంరెడ్డి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ కి తరలిస్తుండగా మార్గ మధ్య లో రాంరెడ్డి చనిపోయాడని అన్నారు.ఈ ఘటనపై వేములవాడ పోలీసులు కేసు నమోదు చేసి బారాజు మల్లారెడ్డి, మరియు నరసింహా రెడ్డి ని రిమాండ్ కు తరలించారు.అప్పటి సీఐ శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా,పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించాగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్లు నరేందర్, రమేష్ లు కోర్టులో 17 మంది సాక్షులను ప్రవేశపెట్టగా పూర్వాపరాలను పరిశీలించగా,నేరం రుజువు కావడంతో నిందితులు బారాజు మల్లారెడ్డి కి జీవిత ఖైదు,5000 రూపాయల జరిమానా,బారాజు నరసింహ రెడ్డికి 07 సంవత్సరాల జైలు శిక్ష, మరియు 3000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు.

## పెద్దూరు పాఠశాలకు ఆటో మిటిక్ బెల్ సిస్టమ్ అందజేత



**బలగం టీవీ , సిరిసిల్ల**

పెద్దూరు లోని ఎం పి హెచ్ ఎస్ పాఠశాలలో టీచర్లకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా.వారికి సమయానుసారంగా మొగే రూ 9000 విలువ గల ఆటోమిటిక్ బెల్ సిస్టం ని కాంగ్రెస్ పార్టీ 8వవార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్ పాఠశాలకు అందించారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు . అనంతరం మంగ ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థులు మంచిగా చదువుకొని, తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని , లక్ష్యాలను సాధించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయ బందం, బైఫెరికేషన్ కమిటీ చైర్మన్ తమ్మటి జీవన్, రకం రమేష్,ఉల్చే నారాయణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

## అమరజవాన్ కల్నల్ మన్‌ప్రీత్‌సింగ్‌కు కీర్తిచక్ర




**బలగం టీవీ , హైదరాబాద్**

జమ్ముకశ్మీర్ లోని అనంతనాగ్‌లో గత ఏడాది సెప్టెంబర్‌లో ఉగ్రవాద నిరోధక ఆపరేషన్‌లో అమరుడైన కల్నల్ మన్‌ప్రీత్‌సింగ్‌కు మరణానంతర కీర్తిచక్ర అవార్డు నిర్ణయిమైంది. మరోముగ్గురు ఆర్మీ జవాన్లకు కూడా కీర్తి చక్ర అవార్డు నిర్ధారించారు. వారిలో రైఫిల్‌మేన్ రవికుమార్ (మరణానంతర), మేజర్ మల్లరామగోపాల నాయుడు, డిఎస్‌పి (జమ్ముకశ్మీర్ పోలీస్) హిమయూన్ ముజ్జమిల్ భట్ లకు కీర్తిచక్ర అవార్డు వచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సాయుధ దళాలకు, కేంద్ర సాయుధ పోలీస్ అధికారులకు మొత్తం 103గాలంట్రీ అవార్డులు ప్రదానం చేస్తారు. నాలుగు కీర్తిచక్రలు, గాలంటరీ అవార్డులతోపాటు 18 శౌర్యచక్రలు (నలుగురికి మరణానంతరం), ఒక విశిష్ట సేనా మెడల్, 63 సేనా మెడల్స్, 11 నవోసేనా మెడల్, 6 వాయుసేనా మెడల్స్ అందిస్తారు.

## డాక్టర్లు మంచిగా వైద్యం చేస్తుండ్రా




- వైద్య సేవలు ఎలా ఉన్నాయి..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , వేములవాడ**

ఆసుపత్రిలో వైద్య సేవలు మంచిగా ఉన్నాయా, డాక్టర్లు, సిబ్బంది వైద్యం బాగానే చేస్తున్నారా అంటూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వయంగా రోగులతో మాట్లాడి వైద్య సేవల తీరుపై ఆరా తీశారు. బుధవారం వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రి లోని అన్ని విభాగాలను, రోగులకు సేవలు అందిస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఔట్ పేషెంట్ విభాగాలను, ల్యాబ్, ఐపి వార్డు, ఫార్మసీ, పిడియాట్రిక్ వార్డు, ఐసీయూ, ఎం.ఐ.సీ.యూ. విభాగాలను పరిశీలించి, ప్రతి రోజూ ఎంత మంది పేషెంట్లు వస్తున్నారు,ఎంత మంది జ్వరంతో వస్తున్నారు, ఎంత మందికి పరీక్షలు చేస్తున్నారు అనే వివరాలను ఆసుపత్రి పర్యవేక్షకులు డా.పెంచలయ్య ను అడిగి తెలుసుకున్నారు. ఐపి వార్డులో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి ఆసుపత్రిలో సేవలు ఎలా ఉన్నాయి అనే వివరాలను ఆరా తీశారు. ఎక్కడి నుంచి వచ్చారు, ఆసుపత్రికి వచ్చిన ఎన్ని రోజులు అవుతుంది అని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. విష జ్వరాలు, డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ల్యాబ్, కంటి పరీక్షలు, దంత వైద్య, డీ.ఈ.ఐ.సీ విభాగాలను తనిఖీ చేశారు. ఉత్తమ వైద్య సేవలను అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి డా.వసంతరావు, పర్యవేక్షకులు డా.పెంచలయ్య, ఆర్ఎంఓ డా. సంతోష్ చారీ, డా.దీప్తి, డా.అనిల్, తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్ మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించి క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడంతోపాటు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆసుపత్రి వాతావరణన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాజగోపాల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జిందం రేఖ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగిలో దారుణ హత్య

**బలగం టీవీ , హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా పరిధిలోని నార్సింగిలో ఓ వ్యక్తి దారుణ హత్య జరిగింది. గుర్తు తెలియని వ్యక్తి రాజు అనే వ్యక్తిని అతి కిరాతకంగా గొంతుకోసి చంపేశాడు. హత్య అనంతరం దుండగుడు నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. దాంతో పోలీసులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. కాగా ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని విమర్శలు వస్తున్నాయి.

## రుద్రంగి బిడ్డకు దక్కిన సముచిత గౌరవం

- పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వ విప్ ఆది
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



**బలగం టీవీ ,రుద్రంగి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్రం లోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం జరిగే వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని జెండా ఆవిష్కరించనున్నారు.

పోలీస్ గౌరవ వందన స్వీకరించి, రాష్ట్ర, జిల్లా అభివద్ధిపై ప్రసంగించనున్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మారుమూల గ్రామమైన రుద్రంగి బిడ్డ ఇప్పటికే పలు పదవుల బాధ్యతలు చేపట్టి మంచి ఖ్యాతి గడించారు. ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యే గెలుపొందగా, జిల్లా కేంద్రంలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొని జెండా ఆవిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆది శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్‌ను చేశారు. తమ గ్రామ బిడ్డ ఎంతో ఓపిక, పట్టుదలతో ప్రజా సమస్యలపై పోరాడి, ఉన్నత స్థానానికి ఎదగడం తమకు గర్వకారణంగా ఉందని, రానున్న రోజుల్లో ఆది శ్రీనివాస్ మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టి రుద్రంగి మండలంతో పాటు వేములవాడ నియోజకవర్గాన్నీ, జిల్లాను అన్నిరంగాల్లో అభివద్ధి పథంలో తీసుకెళ్లాలని, రాష్ట్రంలోనే గుర్తింపు తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు...




## ప్రైమరీ స్కూల్ కు ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ అందజేత..

**బలగం టీవీ, గంభీరావుపేట**

గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట ప్రైమరీ పాఠశాలకు సోమారపు మధు, కంటం రాజు మరియు అల్లాడి రాజు ముగ్గురు మిత్రులు కలిసి ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సోమారపు మధు మాట్లాడుతూ ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ విలువ సుమారు రూ. 15 వేలు ఉంటుందని,విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న సదుద్దేశంతో ఈ ప్యూరిఫైడ్ వాటర్ మిషన్ అందించినట్లు వారు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు జక్కుల యశు పాలు,అజయ్,సతీష్ కిరణ్, శిరిష, యూత్ సభ్యులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా గురుకుల విద్యార్థికి జాతీయ గౌరవం



**బలగం టీవీ , హైదరాబాద్**

దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఖమ్మం గురుకుల విద్యార్థిని వి గ్రేషితకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఎర్రకోట వేడులకు రావాలని పిలుపు వెలువడింది. రైతులు, అంగన్వాడి కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులకు పంద్రాగస్టు వేడుకలలో పాల్గొనేందుకు ఆహ్వానాలు వెలువడ్డాయి. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లా నేలకొండపల్లి తెలంగాణ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువున్న బాలిక గ్రేషితకు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందడం పట్ల స్థానికులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కాగా తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు కూర సుజాతకు, మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాన్‌పూర్ నివాసి శశాంక్ విశ్వనాథ్‌కు కూడా 15వ ఆగస్టు ఉత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా వర్తమానం అందింది. దీనితో ఆయా ప్రాంతాల వారు సంతోషం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి ఖమ్మంలోని పలు గురుకుల పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# టీమిండియా బౌలింగ్ కోచ్‌గా మోర్నే మోర్కెల్..!



**బలగం టీవి, ముంబై**

భారత క్రికెట్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా సౌతాఫ్రికా మాజీ బౌలర్ మోర్నే మోర్కెల్ నియమితుడయ్యాడు. ఈ మేరకు ఈ విషయాన్ని ఓ వార్తా సంస్థకు బీసీసీఐ కార్యదర్శి జే షా ధ్రువీకరించారు. గతంలో పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా మోర్నే చేశాడు. గతంలో అతను ఐపీఎల్‌లోనూ ఆడాడు. కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్ల తరపున అతను ప్రాతినిధ్యం వహించాడు. కొత్త చీఫ్ కోచ్ గంభీర్ నేతృత్వంలో.. మోర్కెల్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మోర్కెల్.. కొత్త బాధ్యతలు స్వీకరించనున్నారు.

# బ్రిటీష్ సింగర్‌తో హార్దిక్ పాండ్యా డేటింగ్..!





**బలగం టీవి, ముంబై**

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. బ్రిటీష్ సింగర్ జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియా వేదికగా హాట్‌టాపిక్‌గా మారాయి. అంతేకాకుండా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఇద్దరూ ఒకరినొకరు ఫాలో చేసుకుంటుండటంతో ఈ వార్తలకు బలం చేకూరుతోంది. సింగర్ జాస్మిన్ .. బ్లూ కలర్ బికినీ.. బ్లూ షర్ట్‌తో .. ఓ పూల్ వద్ద ఫోటో దిగింది. ఆ ఫోటో బ్యాక్‌డ్రాప్‌లో మైకోనస్ సీనరి కనిపిస్తోంది. స్ట్రా హ్యాట్, ఓవర్‌సైజ్ సన్‌గ్లాసెస్‌తో ఆమె దర్శనమిచ్చింది. అయితే అదే పూల్ వద్ద ఉన్న వీడియోను హార్దిక్ పోస్టు చేశాడు. క్రీమ్ కలర్ ప్యాంట్, ప్రింట్ షర్ట్, సన్‌గ్లాసెస్‌తో హార్దిక్ వెరైటీ లుక్‌లో ఉన్నాడు. ఫోటోల్లో ఇద్దరి బ్యాక్‌గ్రౌండ్ మ్యాచ్ కావడంతో.. ఆన్‌లైన్‌లో ఫ్యాన్స్ ట్రోలింగ్ మొదలుపెట్టారు.

బ్రిటీష్ సింగర్, టెవీ పర్సనాల్టీగా జాస్మిన్‌కు గుర్తింపు ఉన్నది. బ్రిటీష్ రియాల్టీ టీవీ సిరీస్ ద ఓన్లీ వే ఈజ్ ఎసెక్స్ లో నటించిన తర్వాత ఆమెకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. మరో వైపు హార్దిక్ పాండ్యా మాజీ భార్య నటాషా ప్రస్తుతం సెర్బీయాలో ఉన్నది.

ఇటీవలే తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న బాలీవుడ్ బ్యూటీ నటాషా స్టాంకోవిచ్‌తో హార్దిక్ పాండ్యా విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఇద్దరూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'నాలుగు సంవత్సరాల పాటు కలిసి ఉన్న తర్వాత నటాషా, నేను విడిపోవాలని పరస్పర అంగీకారంతో నిర్ణయించుకున్నాం. కలిసి ఉండటానికి సాధ్యమైనంతగా ప్రయత్నించాం. ఇద్దరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. ఎన్నో మధుర క్షణాల అనంతరం, కుటుంబం ఏర్పడిన తర్వాత విడిపోవడం కఠిన నిర్ణయమే. ఆగస్త్య మా ఇద్దరితోనూ ఉంటాడు. అతని సంతోషం కోసం సహ తల్లిదండ్రులా మేం అండగా ఉంటాం.ఈ కష్టమైన సమయంలో మా గోప్యతకు సహకరించాలని, మాకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం'అని హార్దిక్, నటాషా ట్యాగ్ లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. విడాకుల అనంతరం నటాషా తన కుమారుడు అగస్త్యాతో కలిసి ముంబైని వదిలి సొంత దేశం సెర్బియా వెళ్లిపోయింది. ఇక విడాకులు తీసుకున్నా.. సోషల్ మీడియా వేదికగా ఈ జోడీ యాక్టీవ్‌గానే ఉంటుంది. నటాషా పోస్ట్‌లకు హార్దిక్ పాండ్యా లైక్ చేయడంతో పాటు కామెంట్ చేస్తున్నాడు.

# వెంకటేష్ కొత్త మూవీ మేకింగ్ రిలీజ్



**బలగం టీవి, హైదరాబాద్**

డైరెక్టర్ అనిల్ రావిపూడిహీరో వెంకటేశ్ కలిసి ఓ సినిమా చేస్తున్నారని తెలిసిందేరీ ఈ సినిమా షూటింగ్ జులైలో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో వేసిన భారీ సెట్‌లో మొదలైంది. దీనికి సంబంధించిన వీడియో కూడా నెట్టింట హల్ చల్ చేస్తోంది. తాజాగా మరో ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్ షూటింగ్ లొకేషన్‌లో తీసిన విజువల్స్‌కు సంబంధించిన వీడియోను మేకర్స్ షేర్ చేశారు. మాజీ పోలీసాఫీసర్ ఫుల్ ఎనర్జీతో మళ్లీ డ్యూటీని మొదలుపెట్టాడు. వెంకీమామ ఎస్‌వీసీ 58 సెట్స్‌లో జాయిన్ అయ్యాడు. ఈ ట్రయాంగులర్ క్రైం ఎంటర్‌టైనం షూటింగ్ పొల్లాచ్చిలో జెడ్‌స్పీడ్‌లో కొనసాగుతుందంటూ అనిల్ రావిపూడి టీం షేర్ చేసిన వీడియో ఇప్పుడు మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది.ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ మూవీని 2025 సంక్రాంతి కానుకగా విడుదల చేస్తున్నట్టు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈ మూవీలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, ప్రముఖ తమిళ నటుడు వీటీవీ గణేశ్‌కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఇప్పటికే దిల్ రాజు, వెంకీ, అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేశాయి. తాజాగా మరోసారి శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై వస్తోన్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# రోహిత్ శర్మకు అత్యుత్తమ ర్యాంక్



**బలగం టీవి, ముంబై**

ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ అత్యుత్తమ ర్యాంక్ సాధించాడు. ఒక ర్యాంక్ ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నాడు. రోహిత్ కెరీర్‌లో నమోదైన బెస్ట్ ర్యాంక్ ఇదే కావడం విశేషం.

అంతకుముందు విడుదలైన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రోహిత్ మూడో స్థానంలో ఉన్నాడు.ఇప్పుడీ ర్యాంక్‌తో అంతకుముందు రెండో స్థానంలో ఉన్న యంగ్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్‌ను వెనక్కినెట్టి రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక రోహిత్ తర్వాతి స్థానాల్లో 4వ స్థానంలో విరాట్ కోహ్లీ, ఐర్లాండ్ బ్యాటర్ టెక్టార్ ఉండగా, పాకిస్థాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ మాత్రం నెంబర్ వన్ పొజిషన్‌లో కొనసాగుతున్నాడు.

ఇటీవల శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. మిగతా బ్యాటర్లు అంతా విఫలమైన వేళ.. రెండు హాఫ్ సెంచరీలతో సత్తా చాటాడు. మూడు మ్యాచ్‌ల్లో 52.33 సగటుతో 157 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శనతో వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో నిలిచాడు. 824 పాయింట్స్‌తో పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజామ్ అగ్రస్థానంలో ఉండగా.. రోహిత్ శర్మ 765 రేటింగ్ పాయింట్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు. శుభ్‌మన్ గిల్(763), విరాట్ కోహ్లీ(746) మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.

మరోవైపు బౌలర్లలో సౌతాఫ్రికా ప్లేయర్ కేశవ్ మహారాజ్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, ఆ తర్వాతి పొజిషన్స్‌లో ఇంగ్లాండ్ ప్లేయర్ జోష్ హాజిల్ వుడ్, ఆస్ట్రేలియా ప్లేయర్ ఆడమ్ జంపా, టీమ్‌ఇండియా బౌలర్ కుల్‌దీప్ యాదవ్ ఉన్నారు. జస్‌ప్రీత్ బుమ్రా ఎనిమిదో స్థానంలో ఉండగా, మరో భారత బౌలర్ మహ్మద్‌సిరాజ్ ఐదు స్థానాలు దిగజారి పదో స్థానానికి పడిపోయాడు. ఇదిలా ఉండగా, వన్డే ఆల్ రౌండర్స్ ర్యాంకింగ్స్‌లో మహ్మద్ నబీ, షకీబ్ అల్ హసన్, సికిందర్ రజా టాప్ పొజిషన్‌లో ఉన్నారు.

# కంగనా రనౌత్ ఎమర్జెన్సీ ట్రైలర్ విడుదల




**బలగం టీవి, ముంబై**

బాలీవుడ్ నటి కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' దివంగత భారత ప్రధాని ఇందిరాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో ఇందిరాగాంధీగా కంగనా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం గతేడాది నవంబరు 24న విడుదల కావాల్సి ఉండగా.. అనుకోని కారణాల వలన విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత జూన్ 14న విడుదల చేయానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే ఈ క్రమంలోనే కంగనా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం హిమచల్ ప్రదేశ్ 'మండి' నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటి చేసి గెలవడంతో రాజకీయల్లో బిజీ అయ్యి ఈ సినిమా మళ్లీ వాయిదా పడింది. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమాను దసరా కానుకగా సెప్టెంబర్ 06న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఇండో – పాక్ టైంలో ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు.. అలాగే భారతదేశంలో చీకటిరోజులుగా పిలువబడే 'ఎమర్జెన్సీ' గురించి ఈ మూవీలో చూపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రంలో జయప్రకాష్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పాత్రలో శ్రేయస్ తల్పడే కనిపించనున్నారు. జీ స్టూడియోస్,

## ఎన్టీఆర్ చేతి మణికట్టుకు గాయం..

**బలగం టీవి, హైదరాబాద్**





యంగ్ టైగర్ ఎన్టీఆర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడంటూ ఓ వార్త సోషల్ మీడియాలో హల్ చల్ చేసింది. అయితే.. ఈ వార్తలో ఎంత మాత్రం నిజం లేదని ఎన్టీఆర్ టీమ్ తెలియజేసింది. అయితే.. రెండు రోజుల క్రితం జిమ్‌లో వర్కవుట్ చేస్తుండగా ఎన్టీఆర్ ఎడమ చేతి మణికట్టుకు స్వల్ప గాయమైనట్లు వెల్లడించింది. మణికట్టు గాయంతోనే ఆయన మంగళవారం రాత్రి కూడా దేవర షూటింగ్‌లో పాల్గొన్నాడని, తనకు సంబంధించిన షూట్ మొత్తాన్ని పూర్తి చేసినట్లు తెలియజేసింది. చేతికి బ్యాండేజీతో ఉన్న ఎన్టీఆర్ చేతికి సంబంధించిన ఫోటోని పోస్ట్ చేసింది. గాయం కారణంగా ఎన్టీఆర్ రెండు వారాలు విశ్రాంతి తీసుకుంటాడని, ఆ తరువాత సినిమా షూటింగ్స్‌లో బిజీ అవ్వనున్నట్లు వెల్లడించింది. ఎన్టీఆర్‌కు రోడ్డు ప్రమాదం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మవద్దని తెలిపింది.